

ఎమ్మెల్సీ కోదండరాంను సన్మానిస్తున్న జీహెచ్‌ఎంసీ ఔట్‌సోర్సింగ్, ట్రాన్స్‌పోర్ట్ నూతన కమిటీ ప్రతినిధులు

జీహెచ్‌ఎంసీ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి

ఎమ్మెల్సీ కోదండరాం

రాంనగర్, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : జీహెచ్‌ఎంసీ ఔట్‌సోర్సింగ్, ట్రాన్స్‌పోర్ట్ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఎమ్మెల్సీ కోదండరాం అన్నారు. శుక్రవారం తెలంగాణ జన సమితి అనుబంధ కార్మిక విభాగం అధ్యక్షుడు ఆకుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో జన సమితి కార్యాలయంలో జీహెచ్‌ఎంసీ ఔట్‌సోర్సింగ్, ట్రాన్స్‌పోర్ట్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ముఖ్యఅతిథిగా హాజరైన కోదండరాం, తెలంగాణ జన సమితి గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు ఎం.నర్సయ్య కమిటీని ప్రకటించారు. నూతన అధ్యక్షుడిగా జహీర్, ప్రధాన కార్యదర్శిగా జగదీష్, ఉపాధ్యక్షులుగా బియాదగిరి, సయ్యద్ ఫాయాజ్, జెడి.కుమార్, బి.రాజు, భూపతి, అశోక్, అడిషనల్ సెక్రటరీగా పి.మురళీ, కార్యనిర్వహక కార్యదర్శిగా సీ.హెచ్.కృష్ణ, కోశాధికారిగా భగవతిరెడ్డి, మహిళా సెక్రటరీగా వరలక్ష్మిని ఎన్నుకున్నారు. వీరితో పాటు మరో 15 మంది కమిటీ సభ్యులు, వివిధ జోన్ల అధ్యక్షులను ఎన్నుకున్నారు.

బుక్కపట్నం రమాదేవికి సత్కారం



సత్కరిస్తున్న మధుసూదనాచారి

చిక్కడపల్లి, జూలై 4 (ఆంధ్రజ్యోతి): సమాజసేవకురాలు, కవయిత్రి బుక్కపట్నం రమాదేవి ఇటీవల గౌరవ డాక్టరేట్ అందుకున్న సందర్భంగా ఆమెను ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి అభినందించారు. ఇటీవల త్యాగరాయగానసభలో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ఈ సందర్భంగా రమాదేవిని సత్కరించి ఆమెను ప్రశంసించారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న జస్టిస్ కాశీవిశ్వేశ్వరరావు, ఇనాక్, జనార్దనమూర్తి

సామాజికహితం.. ఇనాక్ సాహిత్యం

చిక్కడపల్లి, జూలై 4 (ఆంధ్రజ్యోతి): ఇనాక్ సాహితీ ప్రక్రియలపై పలువురు సాహితీకారులు చేసిన రచనలు వారం రోజులుగా ఆవిష్కరించడం ఆయన ప్రతిభకు నిదర్శనమని విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ కాశీ విశ్వేశ్వరరావు అన్నారు. త్యాగరాయగానసభ ఆధ్వర్యంలో జరుగుతున్న ఇనాక్ సాహితీ సప్తాహంలో భాగంగా అభ్యుదయ రచయితల సంఘం అధ్యక్షుడు ఆచార్య రాచపాళెం చంద్రశేఖర్‌రెడ్డి రచించిన ఆచార్య కొలకలూరి ఇనాక్ సాహిత్యంలోకి గ్రంథావిష్కరణసభ గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి అధ్యక్షతన జరిగింది. పుస్తకాన్ని జస్టిస్ కాశీవిశ్వేశ్వరరావు ఆవిష్కరించగా కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖ సాహితీవేత్త ఆదినారాయణ మాట్లాడుతూ ఇనాక్ సృజించని సాహితీప్రక్రియ లేదన్నారు. ప్రతి సాహితీప్రక్రియ సామాజికహితంగా ఉంటుందన్నారు. ఈ సభలో గానసభ పాలకవర్గసభ్యుడు బండి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. నాట్యగురువు తేజస్విని శిష్యబృందం ప్రదర్శించిన శాస్త్రీయ నృత్యాంశాలు ఆకట్టుకున్నాయి.



దోభీగల్లీలో దివ్యాంగులు అంకిరాల మంగ, శ్యామ్‌గౌడ్‌లకు బ్యాటరీ ట్రై సైకిల్‌ను అందజేసిన కెంచె మహేష్‌కుమార్

దివ్యాంగులు పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

నల్లకుంట, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : దివ్యాంగుల సంక్షేమం కోసం ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన పథకాలను సద్వినియోగం చేసుకోవాలని బాగ్‌అంబర్‌పేట డివిజన్ బీఆర్‌ఎస్ ప్రధాన కార్యదర్శి కెంచె మహేష్‌కుమార్ అన్నారు. శుక్రవారం డివిజన్‌లోని దోభీగల్లీలో దివ్యాంగులు అంకిరాల మంగ, శ్యామ్‌గౌడ్‌లకు బ్యాటరీ ట్రై సైకిల్‌ను ఆయన అందజేసి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగులు ఎదుర్కొంటున్న సమస్యలను అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ దృష్టికి తీసుకువస్తే వాటి పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకుంటారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అంబర్‌పేట దివ్యాంగుల సంఘం అధ్యక్షుడు మంద భిక్షపతియాదవ్, ఉపాధ్యక్షుడు సింగం నర్సింగ్‌యాదవ్, వర్కింగ్ ప్రెసిడెంట్ తాళ్లబాబురావు, ప్రధాన కార్యదర్శి కాస ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



నల్లకుంట నర్సింహబస్తీ, మల్లికార్జున్‌నగర్ ప్రభుత్వ ప్రైమరీ పాఠశాల విద్యార్థులకు లాంగ్ నోట్‌బుక్స్ పంపిణీ చేస్తున్న రెడ్డిమల్ల పార్వతి

పేద విద్యార్థులకు చేయూత : రెడ్డిమల్ల పార్వతి

నల్లకుంట, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : సేవా కార్యక్రమాలతోపాటు పేద విద్యార్థులకు చేయూతనందించడంలో తమవంతు సహకారం అందిస్తున్నట్లు రమాబాయ్ మాలల సంక్షేమ సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షురాలు డాక్టర్ రెడ్డిమల్ల పార్వతి అన్నారు. శుక్రవారం అంబర్‌పేట నియోజకవర్గంలోని రామకృష్ణనగర్, నర్సింహబస్తీలలోని ప్రభుత్వ ప్రైమరీ స్కూల్‌తో పాటు నగరంలోని ఎర్రగడ్డ ఓల్డ్ సుల్తాన్‌నగర్ ప్రభుత్వ ప్రైమరీ స్కూల్‌లో పేద విద్యార్థులకు లాంగ్ నోట్ బుక్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆమె పేద విద్యార్థులకు లాంగ్ నోట్ బుక్స్ పంపిణీ చేసి మాట్లాడారు.

'అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలి'

రాంనగర్, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : జీహెచ్‌ఎంసీ అనుమతి లేకుండా గాంధీనగర్ డివిజన్‌లోని జవహర్‌నగర్ ఎస్సార్టీ 32 ఇంటి యజమాని అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ జవహర్‌నగర్ శ్రీ లక్ష్మి ఉప్పలమ్మ ఆలయ దేవాలయకమిటీ ప్రతినిధులు శుక్రవారం జీహెచ్‌ఎంసీ ముషీరాబాద్ సర్కిల్ డిఎంసీ, టౌన్‌ప్లానింగ్ ఏసీపీలకు అబిడ్స్‌లోని సర్కిల్ కార్యాలయంలో శుక్రవారం ఫిర్యాదు చేశారు. ఈసదర్భంగా ఆలయ కమిటి అధ్యక్షుడు సంజీవరెడ్డి, ప్రధాన కార్యదర్శి పద్మవతి, ఉపాధ్యక్షురాలు ప్రసన్నలక్ష్మీ, కోశాధికారి పవన్‌కుమార్ మాట్లాడుతూ, ఎస్సార్టీ కాలనీ 32 యాజమాని సాబేర్ బేగం జీహెచ్‌ఎంసీ నుంచి నిర్మాణానికి అనుమతులు లేకుండానే ఎలాంటి సెట్ బ్యాక్ లేకుండా నిర్మాణ పనులు చేపడుతున్నారని తెలిపారు.

జీహెచ్‌ఎంసీ అనుమతి తీసుకోకుండా జవహర్ నగర్‌లోని ఎస్సార్టీ కాలనీలో జరుగుతున్న నిర్మాణ పనులను వెంటనే నిలిపివేస్తామని టౌన్‌ప్లానింగ్ ఏసీపీ దేవేందర్ తెలిపారు. అనుమతులు లేకుండా నిర్మాణాలు పనులు చేపట్టడం జీహెచ్‌ఎంసీ నిబంధనలకు విరుద్ధమని చెప్పారు.

అర్హులకు ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలి

ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్

ముషీరాబాద్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్‌లో పక్కా గృహాలకోసం దరఖాస్తు చేసుకున్న అర్హులైన పేదలందరికి ఇందిరమ్మ ఇండ్లు అందజేయాలని ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్ అన్నారు. గత ప్రభుత్వం, ప్రస్తుత ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి వల్లే పేదలకు ఇండ్లు దక్కడం లేదని విమర్శించారు. శుక్రవారం ముషీరాబాద్ డివిజన్‌లోని బాపూజీ నగర్‌లో వాటర్ ట్యాంక్, పేదలకు దుప్పట్ల పంపిణీ కార్యక్రమాన్ని డివిజన్ కార్పొరేటర్ సుప్రియా నవీన్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎంపీ లక్ష్మణ్ మాట్లాడుతూ.. ముషీరాబాద్ నియోజకవర్గంలో తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో నియోజకవర్గం ప్రజలకు 3000 ఇండ్లు వాంబే పథకం ద్వారా నిర్మించి ఇచ్చామని తెలిపారు. బాగ్‌లింగంపల్లిలో లంబాడీ తండా వాసులకు సైతం పక్కా గృహాలు నిర్మించి ఇచ్చామన్నారు. గాంధీనగర్, భోలక్‌పూర్ సమీపంలోని నేతాజీ నగర్‌లో అకారణంగా రోడ్డు వెడల్పు పేరుతో ప్రభుత్వం పేదల ఇండ్లు కూల్చివేసిందని ఆరోపించారు. నియోజకవర్గ పేదలకు న్యాయం చేసేందుకు జిల్లా కలెక్టర్, జిల్లా ఇన్‌చార్జి మంత్రిని కలిసి విజ్ఞప్తి చేస్తామని తెలిపారు.

ఎట్టకేలకు మంచినీటి ట్యాంక్ ప్రారంభం

బాపూజీనగర్‌లో మంచినీటి సమస్య పరిష్కారానికి అప్పటి ఎమ్మెల్యే లక్ష్మణ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మంచినీటి ట్యాంక్ ఎట్టకేలకు పదేళ్ల అనంతరం పునఃప్రారంభించారు. 2016లో ప్రస్తుత ఎంపీ, గతంలో ముషీరాబాద్ ఎమ్మెల్యేగా కొనసాగిన లక్ష్మణ్ పవర్ బోర్ ఏర్పాటు పనులను ప్రారంభించారు. కానీ కావల్సిన విద్యుత్ లేకపోవడంతో నిరుపయోగంగా మారింది. దీనితో పవర్‌బోర్‌ను అందుబాటులోకి తీసుకురావాలని కోర్టులో కేసు వేయడంతో స్పందించిన జలమండలి కోర్టు ఆదేశాలతో పవర్‌బోర్‌కు విద్యుత్ బిల్లులు తామే చెల్లిస్తామని అనుమతి ఇవ్వడంతో శుక్రవారం లక్ష్మణ్‌ను ఆహ్వానించి పునఃప్రారంభించారు. దీంతో ఎంపీకి కార్పొరేటర్ శాలువాలతో సన్మానించారు.



పేదలకు దుప్పట్లు పంపిణీ చేసిన ఎంపీ కె.లక్ష్మణ్, కార్పొరేటర్ సుప్రియా నవీన్ గౌడ్, బీజేపీ మహాకాళి జిల్లా అధ్యక్షుడు భరత్ గౌడ్

యువత చదువుపై దృష్టి సారించాలి

కవాడిగూడ, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : యువత మత్తు, డ్రగ్స్, గంజాయి తదితర వ్యసనాలకు బానిస కాకుండా క్రీడలు, చదువుపై దృష్టి సారించి తమ బంగారు భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని బీజేపీ ఎంపీ లక్ష్మణ్ పిలుపునిచ్చారు. కవాడిగూడ కార్పొరేటర్ జి రచనశ్రీ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహించిన క్రికెట్‌పోటీల విజేతలకు శుక్రవారం ఎన్‌టీఆర్ స్టేడియంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీ లక్ష్మణ్ ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు బహుమతులతో పాటు పోటీలలో పాల్గొన్న క్రీడాకారులకు క్రికెట్ కిట్‌లను పంపిణీ చేశారు. అదేవిధంగా 50 ఏళ్లు దాటిన వారికి ప్రత్యేక యోగా మ్యాట్‌లను పంపిణీ చేశారు.



ఎన్‌టిఆర్ స్టేడియంలో జరిగిన క్రికెట్ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎంపీ లక్ష్మణ్, కార్పొరేటర్ రచనశ్రీ

విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చర్యలు : ఎమ్మెల్యే ముఠా గోపాల్

ముషీరాబాద్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్‌లో లోటెల్జేజ్, ప్రమాదంగా మారిన విద్యుత్ స్తంభాలను తొలగించి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. శుక్రవారం ముషీరాబాద్ డివిజన్‌లోని శాస్త్రీనగర్‌లో జనావాసాలకు అనుకుని ప్రమాదకరంగా మారిన విద్యుత్ స్తంభాలను తొలగించి నూతన విద్యుత్ స్తంభాన్ని ఏర్పాటు చేశారు. ఈ నిర్మాణ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే ముఠాగోపాల్ మాట్లాడు తూ.. దశాబ్దాల కిందట వేసిన ఐరన్ విద్యుత్ స్తంభాలు తుప్పుపట్టి కూలిపోయే స్థితిలో ఉన్నాయన్నారు. వాటిని తొలగించి కొత్తవాటిని ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం శాస్త్రీనగర్‌లో పాదయాత్ర చేసి ప్రజల సమస్యలను ఆయన తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఏఈ సుదామా, తదితరులు పాల్గొన్నారు.



శాస్త్రీనగర్‌లో విద్యుత్ స్తంభం నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ముఠాగోపాల్

రోడ్ కటింగ్‌పై జీహెచ్‌ఎంసీ.. జలమండలి వాగ్వాదం

ఎమ్మెల్యే ముఠాగోపాల్ జోక్యంతో అధికారుల మధ్య రాజీ

రాంనగర్, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : జీహెచ్‌ఎంసీ అనుమతి లేకుండా ముషీరాబాద్ సర్కిల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో జలమండలి అధికారులు చేపట్టిన రోడ్డు కటింగ్ వ్యవహారం జీహెచ్‌ఎంసీ జలమండలి అధికారుల మధ్య వివాదానికి దారితీసింది. తమ నుంచి అనుమతి తీసుకోకుండా లక్షలు వెచ్చించి వేసిన రోడ్లను ఎలా కట్ చేస్తారని పేర్కొంటూ జీహెచ్‌ఎంసీ అధికారులు చిలకలగూడ జలమండలి అధికారులను ప్రశ్నించారు అడిక్‌మెట్ డివిజన్‌లోని రాంనగర్ మెయిన్ రోడ్‌నుంచి లక్ష్మమ్మ పార్కుకు వెళ్లే మార్గంతో పాటు రాంనగర్ డివిజన్‌లోని బంధన్ ఫంక్షన్ హాలు వద్ద వేసిన సీసీ రోడ్లను జలమండలి.. జీహెచ్‌ఎంసీ నుంచి ఎలాంటి అనుమతులు తీసుకోకుండా పేమెంట్ చేయకుండానే రోడ్ కటింగ్ చేపట్టారు. దీంతో శుక్రవారం జీహెచ్‌ఎంసీ సర్కిల్ ఇంజనీరింగ్ విభాగం ఈఈ శ్రీనివాస్ రోడ్డు నిర్మాణ పనుల పరిశీలనకు వచ్చారు. రెండు చోట్ల తవ్విన రోడ్లను పరిశీలించి తమ దృష్టికి ఎందుకు తీసుకురాలేదని డీఈ గీత, ఏఈ వినోద్‌కుమార్, వర్క్‌ఇన్‌స్పెక్టర్ శివకుమార్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే రోడ్ కటింగ్ పనులను నిలిపి వేయించి వారికి నోటీసులు ఇవ్వాలని ఆదేశించారు. దీంతో మేనేజర్ శివసాయిలు, సదరు కాంట్రాక్టర్‌పై ముషీరాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

రాజీ కుదిర్చిన ఎమ్మెల్యే

జీహెచ్‌ఎంసీ, జలమండలి అధికారుల మధ్య రోడ్ కటింగ్ అంశాలు వివాదంగా మారి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసుకున్నట్లు తెలుసుకున్న ఎమ్మెల్యే ముఠాగోపాల్ ముషీరాబాద్ పోలీస్ స్టేషన్‌కు చేరుకొని ఇరుశాఖల అధికారులతో మాట్లాడి జరిగిన వివాదాన్ని అధికారులు పరిష్కరించుకోవాలని సూచించారు. ఈ సమస్యను పరిష్కరించుకుంటామని డిజిఎం, జలమండలి అధికారులు అంగీకారానికి రావడంతో జీహెచ్‌ఎంసీ అధికారులు అంగీకరించారు.

జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలి: డీవైఎఫ్‌ఐ



సచివాలయం ముట్టడికి ప్రయత్నిస్తున్న డీవైఎఫ్ నేతలను అరెస్ట్ చేస్తున్న పోలీసులు

కవాడిగూడ, చిక్కడపల్లి, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : జాబ్ నోటిఫికేషన్స్‌ను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ డీవైఎఫ్‌ఐ ఆధ్వర్యంలో శుక్రవారం సచివాలయ ముట్టడి కార్యక్రమాన్ని చేపట్టింది, బీఆర్‌కే భవన్‌నుంచి డీవైఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు కోట రమేష్, అనగంటి వెంకటేష్ ఆధ్వర్యంలో నాయకులు కార్యకర్తలు సచివాలయ ముట్టడికి యత్నించారు. పోలీసులు వీరిని అడ్డుకొని అరెస్టు చేశారు. ఈ సందర్భంగా బీఆర్‌కే వద్ద ఆందోళన కారులకు పోలీసులకు మధ్య తోపులాట జరగడంతో కొద్ది సేపు ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. అయినప్పటికీ పోలీసులు వారిని అరెస్టు చేసి నగరంలోని వివిధ పోలీస్‌స్టేషన్‌లకు తరలించారు.

పోలీసు పహారాలో ధర్నా చౌక్

జాబ్ క్యాలెండర్‌లో ప్రకటించిన విధంగా ఉద్యోగాలను భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ నిరుద్యోగులు చలో సెక్రటరియేట్ పిలుపునిచ్చిన నేపథ్యంలో శుక్రవారం ఉదయం నుంచే దోమలగూడ పోలీసులు ఇందిరాపార్కు ధర్నా చౌక్ వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆర్టీసీ క్రాస్‌రోడ్, జవహర్ నగర్ చౌరస్తా, చిక్కడపల్లి సిటీసెంట్రల్ లైబ్రరీ, అశోక్‌నగర్, కట్టమైసమ్మ దేవాలయం వద్ద పోలీసులు ఉదయం నుంచి సాయంత్రం వరకు భారీ పోలీసు బందోబస్తు నిర్వహించారు. ముగ్గురు నిరుద్యోగులను అదుపులోకి తీసుకున్నట్లు చిక్కడపల్లి ఇన్‌స్పెక్టర్ రాజునాయక్ వివరించారు.

'కట్టమైసమ్మ'వద్ద షెడ్లు ఏర్పాటు చేయాలి

కవాడిగూడ, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న లోయర్ ట్యాంక్‌బండ్ కనకాల కట్టమైసమ్మ దేవాలయం వద్ద భక్తుల సౌకర్యార్థం శాశ్వత షెడ్లను నిర్మించాలని శ్రీ కనకాల కట్టమైసమ్మ దేవాలయ భక్త సమాజం వ్యవస్థాపక అధ్యక్షుడు, మాజీ కార్పొరేటర్ టి.రవీందర్ ప్రభుత్వాన్ని, దేవాదాయ శాఖ అధికారులను డిమాండ్ చేశారు. 25 ఏళ్లుగా దేవాలయ భక్తసమాజం ఏర్పాటు చేసి ఆలయం వద్ద శాశ్వత షెడ్లను ఏర్పాటు చేయాలని పోరాటం చేస్తున్నామన్నారు. లోయర్ ట్యాంక్‌బండ్‌లోని కట్టమైసమ్మ ఆలయానికి నగర నలుమూలలనుంచి భక్తులు హాజరై తమ మొక్కులు చెల్లించుకుంటారని ఆయన గుర్తు చేశారు. శుక్రవారం కవాడిగూడ డివిజన్‌లోని లోయర్ ట్యాంక్‌బండ్‌లోని కట్టమైసమ్మ ఆల యం ఎదురుగా ఉన్న టూరిజం స్థలంలో ప్రస్తుతం సీఎంఎస్ వాహనాల పార్కింగ్ కొనసాగిస్తున్నారని, ఆ స్థలంలో శాశ్వత షెడ్లు నిర్మించాలని కట్టమైసమ్మ దేవాలయ భక్త సమాజం ఆధ్వర్యంలో ఆలయం ఎదుట పెద్దఎత్తున నిరసన వ్యక్తం చేశారు.

బీసీ రాయ్ సామాజిక సేవలు నిరుపమానం

చిక్కడపల్లి, జూలై 4 (ఆంధ్రజ్యోతి): బీసీ రాయ్ సామాజిక సేవలు నిరుపమానమైనవని ప్రముఖ సాహితీవేత్త డా. ఓలేటిపార్వతీశం అన్నారు. కమలాకర చారిటబుల్ ట్రస్ట్, లైనెస్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సంస్కృతి ఆధ్వర్యంలో జాతీయ డాక్టర్స్ డే సందర్భంగా డా. బిసి రాయ్ అవార్డ్ ప్రదానసభ శుక్రవారం త్యాగరాయగానసభలో జరిగింది. ఈ సందర్భంగా ప్రముఖ వైద్యులు రవికుమార్, అరుణజ్యోతి, రమ, ప్రజ్ఞ రంగనాథంతోపాటు యోగా థెరపిస్ట్ సత్యారెడ్డిలకు అవార్డులను పార్వతీశం బహూకరించి సత్కరించారు. ఆయన మాట్లాడుతూ వైద్యునిగా, రాజకీయనాయకునిగా బిసి రాయ్ అందించిన సేవలు ఎంతో విలువైనవన్నారు. పశ్చిమబెంగాల్‌కు ముఖ్యమంత్రిగా కూడా ఆయన పనిచేశారన్నారు. ఆయన సేవలను గుర్తించి ఆయనకు భారత ప్రభుత్వం భారతరత్న అవార్డు ప్రకటించి బహూకరించిందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ ఆధ్యాత్మిక రచయిత్రి డా. కేవీ కృష్ణకుమారి, ఆచార్య టి. గౌరీశంకర్, మడిపల్లి దక్షిణామూర్తి, నిర్వాహకులు లైనెస్ భారతీ కమలాకర్, జి. కృష్ణవేణి, లలితాపరమేశ్వరి పాల్గొన్నారు.



సభకు తరలుతున్న కాంగ్రెస్ నేతలు కెన్నడీ, యాదగిరిగౌడ్



కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలతో కిక్కిరిసిపోయిన ఎల్ బీ స్టేడియం

సామాజిక న్యాయ సభ సక్సెస్

బర్కత్‌పుర/రాంనగర్, చిక్కడపల్లి, జూలై 4 (ఆంధ్రజ్యోతి): జై బాపు, జై భీమ్, జై సంవిధాన్‌లో భాగంగా టీపీసీసీ ఆధ్వర్యంలో శుక్రవారం ఎల్.బి.స్టేడియంలో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ సామాజిక న్యాయ సమరభేరీ సభ గ్రాండ్ సక్సెస్ అయింది. సభకు ముఖ్య కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు తరలివెళ్లారు. ముషీరాబాద్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ నాయకులు సుధేష్, అనిల్‌యాదవ్, అంజియాదవ్, కె.వెంకటేష్, నారాయణమూర్తి, తదితరులు ఖైరతాబాద్ నుంచి కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి తౌలుపునూరి కృష్ణగౌడ్, మాజీ కార్పొరేటర్ మమతా గుప్తా, నాయకులు గౌరీశంకర్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

పదోతరగతి విద్యార్థిని అదృశ్యం



ఫైజా ఫాతిమా

అంబర్‌పేట, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : తల్లిదండ్రులు మందలించారని బాలిక మనస్థాపానికి గురై ఇంట్లో నుంచి వెళ్లి పోయిన సంఘటన అంబర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్ వివరాల ప్రకారం.. బాగ్ అంబర్‌పేట బూర్జు గల్లీలో ఉండే గౌస్‌ఖాన్ కుమార్తె ఫైజా పాతిమా స్థానికంగా ఓ ప్రైవేట్ పాఠశాలలో పదోతరగతి చదువుతుంది. తల్లిదండ్రులు పుస్తకాలు ఇప్పించకపోవడంతో ఫోన్‌లో చదువుకుంటుంది. ఈనెల 2 బుధవారం ఆమె తల్లి పుస్తకాలు తెచ్చుకొని చదువుకోవాలని కుమార్తెను మందలించగా మనస్థాపానికి గురైన ఫాతిమా ఆ రోజు సాయంత్రం ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. బంధువులు, స్నేహితుల వద్ద ఎంత వెతికినా ఆచూకీ లభించకపోవడంతో తండ్రి కూతురు కనిపించడం లేదని అంబర్‌పేట పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈమేరకు శుక్రవారం పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కాచిగూడ రైల్వే స్టేషన్‌లో మృతదేహం స్వాధీనం

బర్కత్‌పుర, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : కాచిగూడ రైల్వే స్టేషన్‌లో రైల్వే పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. విజయవాడకు చెందిన దిండి శివం నాయుడు (42) శుక్రవారం కాచిగూడ రైల్వే స్టేషన్‌లోని ప్లాట్‌ఫారం 1 లో చనిపోయాడు. ప్రయాణికులు సమాచారం ఇవ్వగా మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఉస్మానియా మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

డ్రైడే, ఫ్రై డే.. పాటించాలి : రామానుజుల రెడ్డి

ముషీరాబాద్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): పరిశుభ్రతను పాటిస్తేనే సీజనల్ వ్యాధులను నివారించవచ్చని జీహెచ్‌ఎంసీ సర్కిల్-15 డిప్యూటీ మునిసిపల్ కమిషనర్ (డీఎంసీ) రామానుజుల రెడ్డి అన్నారు. శుక్రవారం ముషీరాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో డ్రై డే, ఫ్రై డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ... విద్యార్థులకు మలేరియా, డెంగీ, విష జ్వరాలు, సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలని సూచించారు. ఇంటితోపాటు పరిసరాల పరిశుభ్రతను ప్రతీ ఒక్కరూ సామాజిక బాధ్యతతో పాటించాలన్నారు.

కొత్త లైట్ల ఏర్పాటుకు చర్యలు: కార్పొరేటర్

నల్లకుంట, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : బాగ్‌అంబర్‌పేట డివిజన్ పరిధిలోని పలు బస్తీలు, కాలనీలు, అంతర్గత రోడ్లలో వెలగని వీధి దీపాలను ఎప్పటికప్పుడు గుర్తించి మరమ్మతులు చేపట్టాలని ట్రాన్స్‌కో అధికారులకు కార్పొరేటర్ బి.పద్మావెంకటరెడ్డి సూచించారు. శుక్రవారం డివిజన్‌లోని శివం రోడ్ మెయిన్ రోడ్డు నుంచి వినాయక్‌నగర్ క్రాస్‌రోడ్స్ వరకు ట్రాన్స్‌కో అధికారులు వీధి దీపాల మరమ్మతు పనులను ఆమె పరిశీలించారు.

కృత్రిమ మేథాతో మెరుగైన ఉద్యోగ అవకాశాలు

బర్కత్‌పుర, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : కృత్రిమ మేథాతో మెరుగైన ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని మారుతి టెక్నాలజీస్ ఎండీ మారుతి గుప్తా అన్నారు. శుక్రవారం మారుతి టెక్నాలజీ కేంద్ర కార్యాలయంలో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌కు సంబంధించిన నూతన తరగతుల ప్రారంభ వాల్‌పోస్టర్‌ను ఆమె ఆవిష్కరించి మాట్లాడారు. ప్రస్తుతం ఏ రంగంలోనైనా ఏఐ వినియోగం పెరిగిందని ప్రతి ఒక్కరు దానిపై అవగాహన పెంచుకోకుంటే పోటీ ప్రపంచంలో వెనుకబడి పోతారని అన్నారు. ఈ నెల 15 నుంచి శిక్షణా తరగతులు ప్రారంభిస్తున్నామన్నారు.

9న ఆర్టీసీ సమ్మెను విజయవంతం చేయండి

రాంనగర్, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : నాలుగు లేబర్ కోడ్‌ల రద్దు కోసం ఆర్టీసీ రక్షణ, విద్యుత్ బస్‌ల విధానంలో మార్పు కోసం ఈ నెల 9న జరిగే జాతీయ సార్వత్రిక సమ్మెలో ఆర్టీసీ కార్మికులు, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని తెలంగాణ మజ్దూర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి థామస్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లోని బస్‌భవన్ వద్ద ఆర్టీసీ కార్మికులు సార్వత్రిక సమ్మెలో పాల్గొనాలని కరపత్రాల పంపిణీ చేశారు.



డ్రైవర్‌కు కౌన్సెలింగ్ ఇస్తున్న గాంధీనగర్ ట్రాఫిక్ సీఐ వెంకటలక్ష్మి

ట్రాఫిక్ రూల్స్ పాటించకపోతే కఠిన చర్యలు

కవాడిగూడ, జూలై 4 (ఆంధ్రజ్యోతి): వాహనదారులు ట్రాఫిక్ రూల్స్ పాటించకపోతే కఠిన చర్యలు తప్పవని గాంధీనగర్ ట్రాఫిక్ సీఐ పి.వెంకటలక్ష్మి హెచ్చరించారు. సీజీవో టవర్స్ పరిసర ప్రాంతాలలో అక్రమ పార్కింగ్‌లు, ఫుట్‌పాత్‌లు ఆక్రమించి వ్యాపారాలు చేస్తున్న వారిపై కేసులు నమోదు చేసినట్లు సీఐ వెంకటలక్ష్మి తెలిపారు. శుక్రవారం అసిస్టెంట్ కమిషనర్ మోహన్‌కుమార్ ఆదేశాల మేరకు పలు ప్రాంతాల్లో స్పెషల్‌డ్రైవ్ నిర్వహించారు. ఫుట్‌పాత్‌లను ఆక్రమించిన వారికి, రాంగ్‌రూట్‌లో వాహనాలు నడుపుతున్న వారిపై కేసులు నమోదు చేసి వారి వాహనాలను సీజ్ చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ట్రాక్టర్ డ్రైవర్ పలువురు వాహనదారులకు కౌన్సెలింగ్ ఇచ్చినట్లు తెలిపారు.



స్వర్గీయ మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య జయంతిని పురస్కరించుకుని లకిడీకాపూల్ చౌరస్తాలోని ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న అంబర్‌పేట ఆర్యవైశ్య సంఘం వ్యవస్థాపక చైర్మన్ కొర్తివాడ రాంచందర్‌గుప్త, అధ్యక్షుడు శ్రీనివాస్‌గుప్త, ప్రధాన కార్యదర్శి జైన శ్రీనివాస్‌గుప్త, కోశాధికారి వాసుగుప్త.

(గోల్నాక, ఆంధ్రజ్యోతి)

నేడు మన్యంకొండ హనుమదాసు పద్యనాటక ప్రదర్శన

చిక్కడపల్లి, జూలై 4 (ఆంధ్రజ్యోతి): పాలమూరు కళావిపంచి సంస్థ ఆధ్వర్యంలో శనివారం త్యాగరాయగానసభలో మన్యంకొండ హనుమదాసు చారిత్రక పద్యనాటక ప్రదర్శనను నిర్వహిస్తున్నట్లు సంస్థ అధ్యక్షుడు, నటుడు గుంపుల సుదర్శన్ తెలిపారు. రచయిత, కవి, దర్శకులు పల్లేటి కులశేఖర్ ప్రథమ వర్ధంతి సందర్భంగా నిర్వహిస్తున్న కార్యక్రమంలో ప్రముఖ కవి, గాయకుడు, ఎమ్మెల్సీ గోరేటి వెంకన్న ముఖ్యఅతిథిగా పాల్గొంటారని తెలిపారు.

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కల్పించాలి : సోమయ్య

నల్లకుంట, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : ఏపీలో జర్నలిస్టులకు సీఎం నారా చంద్రబాబునాయుడు తీపికబురు కల్పించారని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య పేర్కొన్నారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ఏపీ అధికారులకు సీఎం చంద్రబాబు ఆదేశించడంపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రంలో కూడా సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కల్పించాలని కోరారు.

పింగళి వెంకయ్యకు నివాళులు

రాంనగర్, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : జాతీయ పతాక రూపకర్త పింగళి వెంకయ్య వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. శుక్రవారం రాంనగర్ గుండులోని పింగళి వెంకయ్య స్మారక సంస్థ, ఛారిటబుల్ ట్రస్ట్‌ల అధ్యక్షురాలు జగదాంబ, చైర్‌పర్సన్ శ్యామలరావుల ఆధ్వర్యంలో నివాళులర్పించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

చిక్కడపల్లి, జూలై 4 (ఆంధ్రజ్యోతి): ఆజామాబాద్ డివిజన్, హైదరాబాద్ సిటీ-1 పరిధిలో శనివారం విద్యుత్ సరఫరా ఉండదని ఏడీఈలు నాగేశ్వరరావు, వినోద్‌కుమార్ తెలిపారు. బాలాజీనగర్, ఎల్‌కెపి, మీరా థియేటర్, ఐసీఐసీఐ బ్యాంక్ పరిధుల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 వరకు, అడిక్‌మెట్ పరిధిలో 12నుంచి 1 వరకు, మూన్‌కేఫ్ పరిధిలో 12 నుంచి 12.30 వరకు, ఎల్ఎన్ నగర్, కెబి, రెడ్‌రోజ్, లిటిల్‌ఫ్లవర్ పరిధుల్లో మధ్యాహ్నం 2నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.